# తపోభంగం

**- సరసి**

ఆంజనేయులు చాలా సాఫ్టు! అయితేనేం మంచి సాఫ్టువేర్ ఇంజనీర్!

సాఫ్ట్‌గా ఉండేవాళ్ళకి, సాఫ్ట్‌వేర్ నిపుణులకి రోజులు బాగోని రోజుల్లో ఆంజనేయులు అమెరికాలో ఓ కంపెనీలో పనిచేస్తూ ఉండేవాడు.

ఓరోజు అతడు భయపడ్డంతా అయ్యింది!

''రేపటినుంచి మీ సేవలు మా కంపెనీకి అవసరం లేదు. ఇంతవరకూ చేసిన సేవలకు థాంక్స్!'' అంటూ పదిమంది పేర్లు గేటు బయట బోర్డుకి తగిలించారొక సాయంత్రం వేళ. అందులో ఆంజనేయులు పేరు మొదటనే ఉంది!

ఇది జరిగి రెండు నెలలయింది. మరో ఉద్యోగానికి విపరీతంగా ప్రయత్నించి, విఫలమై ఉన్నదంతా ఖర్చయిపోయాక కాలిపోయిన ఆశలతో కాలిఫోర్నియాలో విమానం ఎక్కేశాడు!

విమానం చుట్టూ మేఘాలు ముసిరినట్టే అనేక ఆలోచనలు ఆంజనేయులు మస్తిష్కాన్ని చుట్టుముట్టేయి. మనసు పరిపరి విధాల మథనపడి అతణ్ణి మరింత భయపెట్టింది!

ఇండియా చేరుకుని ఇల్లు చేరేడు. బంగారు బిస్కెట్లు తెస్తాడనుకున్న భర్తగారు వట్టి చేతులతో వచ్చేసరికి ఓడిపోయి వచ్చినవాడిలా కనిపించాడతడి భార్యకి.

ఆమె అలగలేదు. అరవ లేదు! తిట్టలేదు తిమ్మలేదు. సింపుల్‌గా సింబాలిగ్గా, ఓ నులక మంచాన్ని వారగా నిలబెట్టి పసుపు, సున్నిపిండి పెట్టి ''స్నానం చెయ్యండి అలిసొచ్చినట్టున్నారు!'' అనేసింది.

చరిత్ర చదువుకున్నవాడు కావటం చేత ఆంజనేయులిట్టే గ్రహించేశాడు. గుండె నీరయిపోయింది!

ఖడ్గతిక్కన యుద్ధంలో ఓడిపోయి ఇంటికి వచ్చినపుడు ఆయన భార్య ఇలాగే అవమానించింది. ఆ అవమానం తట్టుకోలేక ఆయన తిరిగి యుద్ధానికెళ్లి వీరమరణం పొందేడు. మరిప్పుడు ఆంజనేయులు అలా వెళ్లి వీరమరణం పొందుదామన్నా ఆ అవకాశం లేదు. చచ్చినా చావలేని పరిస్థితి! రాత్రంతా తీవ్రంగా ఆలోచించిన ఆంజనేయులికి తెల్లారగట్ల తెలివొచ్చింది. వెంటనే చీటీ పెట్టి, ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

''ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోటానికి? ఏ రైలైతేనేం పారిపోవడానికి?'' అనుకుని వెంటనే ఢిల్లీకి టికెట్ కొనేసి రైలెక్కేశాడు.

• • •

ఢిల్లీ స్టేషనులో దిగి ఒళ్లు విరుచుకుని పళ్లు తోముకున్నాడు ఆంజనేయులు.

''తనిప్పుడేం చెయ్యాలి? ఎక్కడికి వెళ్లాలి? ముందు ఓ కప్పు టీ తాగుదాం'' అనుకుని రోడ్డు పక్కనున్న బండి దగ్గర టీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో ఒక పోలీసు ఓ సాధువు చొక్కా కాలరు పట్టుకుని బరబరా ఈడ్చుకుపోతూ బండ బూతులు తిడుతున్నాడు హిందీలో. యధాలాపంగా అటువైపు తలతిప్పిన ఆంజనేయుల్ని ఆ సాధువు అనుమానంగా చూస్తూ, కానిస్టేబుల్ని ఆగమని బ్రతిమిలాడుతున్నాడు.

''నువు మునసబుగారి బావమ్మర్ది ఆంజనేయులివి కదూ?'' అన్నాడు కానిస్టేబుల్ని విదిలించుకుంటూ వచ్చి.

''అవును'' అని ఆంజనేయులు మాట పూర్తిచేసే లోపులోనే ''నీ దగ్గర వందుంటే ఇవ్వు గురూ!'' అని అతని జేబులో తనే చెయ్యి పెట్టి లాగేసుకోవడం, దాన్ని కానిస్టేబుల్ చేతిలో కుక్కి అతణ్ణి తోసెయ్యడం క్షణాల మీద జరిగిపోయాయి.

''నన్ను గుర్తు పట్టలేదా? సచ్చినాణగారబ్బాయి విసినాథన్ని! బలవంతప్పెళ్లి తప్పించుకుని పారిపోలా?''

ఆంజనేయులు గుర్తుపట్టాడు.

''ప్రస్తుతం హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్నా! షాపింగ్ చేద్దామని ఇక్కడికొచ్చా. నన్ను చూసి ఏ పాకిస్తాన్ వాడనుకున్నాడో ఏమో లాక్కుపోతున్నాడు'' అన్నాడు పళ్లికిలిస్తూ.

తర్వాత తాపీగా ఆంజనేయులు చెప్పిన ట్రాజెడీ అంతా విని ''మన వాళ్లు ఉట్టి వెధవాయలోయ్! అందుకే నే పారిపోయొచ్చేశా! నువ్వు కూడా రారాదూ హాయిగా హిమాలయాల్లో ఏసీలో తపస్సు చేసుకుందాం! అమెరికా నించీ నీలా వచ్చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చాలామంది చేరేరక్కడ!'' అన్నాడు విసినాథం విశాలంగా నవ్వుతూ.

దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆంజనేయులు 'సరే' అన్నాడు. కనీసం అక్కడయినా మనశ్శాంతి దొరికితే చాలు.

• • •

సినిమాల్లో చూపించినట్టు హిమాలయాలు చక్కగా ఆహ్లాదకరంగా ఏం లేవు. ఎక్కడ చూసినా తుక్కూ, చెత్త కుప్పలూ, ప్లాస్టిక్ క్యారీబ్యాగులూ, నిరోధ్‌లతో నానా చీదరగానూ ఉంది. వాటి మధ్యనే అక్కడక్కడ గుట్టలమీద కొంతమంది రుషులు తపస్సు చేసుకుంటున్నారు.

''ఇదివరకటి పరిస్థితులూ లేవు. ఇదివరకటి మనుషులూ లేరు. ఇప్పుడు చాలా మార్పులొచ్చాయి'' అన్నాడు విసినాథం మాటల మధ్యలో.

''అగ్నీ హై?'' దూరంగా ఓ గుట్ట మీద నుంచి ఓ రుషి అడుగుతున్నాడు నోట్లో పొడవాటి చుట్ట పెట్టుకుని.

''నహీ!'' అన్నాడు విసినాథం ముందుకు సాగుతూ.

''బావుంది. అయితే నేను కూడా ఈ చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకుంటా!'' అన్నాడాంజనేయులు ఆవేశపడి.

విసినాథం నవ్వేడు. ''అప్పుడేనా? ముందు చాలా తతంగం ఉంది. ఇవాల్టికి రెస్టు తీసుకో!'' అన్నాడు.

ఆ రాత్రి ఇద్దరూ ఓ చిన్న మఠంలో నిద్రపోయారు. మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకున్నాక హిమాలయాల్లో ఓ దుకాణం దగ్గరకెళ్లారిద్దరూ. ఓ కమండలం, దండం, నాలుగు జతల రుద్రాక్షలూ, జింక చర్మం కొన్నారు. వాటికి రెండు వేలైంది. ఆంజనేయులు ఆ ఖర్చుకి కళ్లు తేలేశాడు!

''సర్లే, నా దగ్గర కాషాయాంబరాలు ఓ జత ఎగస్ట్రా ఉంది. అది వాడుకుందువులే టెంపరరీగా!'' అన్నాడు విసినాథం.

''థేంక్స్'' అన్నాడాంజనేయులు ఒక ఖర్చు తప్పినందుకు.

''అవును చెప్పావు కాదు... ఇంతకీ నువ్వు ఎవరి కోసం తపస్సు చేద్దామనుకుంటున్నావ్? శివుడి కోసమా బ్రహ్మ కోసమా?''

''నాకేతే ఐడియా లేదు. బ్రహ్మయితే బెటరేమో?''

''బ్రహ్మవద్దులే. శివుడే ఈజీ! ఇక్కడందరూ శివుడికే ప్రిఫరెన్స్ ఇస్తారు. పద వెడదాం!'' ముందుకు నడిచాడు విసినాథం.

అది ఒక ఆశ్రమం లాగా ఉంది. అక్కడ 'శివుడు, బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, శక్తి' అని విడివిడిగా పెద్ద బోర్డులున్నాయి. 'శివుడు' అని ఉన్నచోట అన్నిటికంటే పెద్ద లైనుంది. చాలా కోలాహలంగా కూడా ఉంది.

''మనం ఎవరి కోసం తపస్సు చేద్దామనుకుంటున్నామో వాళ్ల లైన్లో నిలబడి, ముందుగా మన పేరు రిజిస్టర్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషను ఫీజు అయిదు వందలు కట్టి పర్మిషను తీసుకోవాలి!''

''ఇదేవిటి? నా కిష్టమొచ్చిన దేవుడి గురించి నేను తపస్సు చేసుకోడానికి వీళ్ల పర్మిషనేవిటి బోడి!''

''అదే మరి! ఇలా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు ఇక్కడికొచ్చేసి, తపస్సులు చేసేసుకుని, దేవుళ్లని ప్రత్యక్షం చేసేసుకుని, వరాలు పట్టుకుపోతూ ఉంటే- మరి ఇక్కడి యూనియనేం కావాలి?''

''యూనియనా?'' ఆశ్చర్యపోయాడాంజనేయులు.

''అవును. ఏళ్ల తరబడి తపస్సులు చేసి చేసీ దేవుళ్లు ప్రత్యక్షం కాక కరడు కట్టిపోయిన రుషులంతా కలిసి కొన్ని యూనియన్లు పెట్టారు. వాళ్ల గైడెన్సు లోనే కొత్త రుషులు తపస్సులు చేసుకోవాలి! వాళ్లు కేటాయించిన గుట్టల మీదనే కూర్చోవాలి. వాటి క్కూడా రిజర్వేషన్లున్నాయి.''

''ఇక్కడకూడా రిజర్వేషన్లా?''

''అవును. ఈ హిమాలయాల నన్నింటినీ పాత

రుషులు ఎప్పుడో కబ్జా చేసేసుకున్నారు. వాళ్ల స్థలాల్లో తపస్సు చేసుకుంటూ వాళ్లకి మనం 'రెంటో' కట్టాలి. మన దగ్గర డబ్బుంటే- 'రియల్‌స్టేట్ బిజినెస్' చేసే రుషులు కూడా ఉన్నారు. వాళ్ల దగ్గర మనం కొన్ని గుట్టలు కొనుక్కోవచ్చు. ఇదిలా ఉండగా- వాళ్ల కెలాగూ దేవుళ్ల ప్రత్యక్షం కావటం లేదు కనక వాళ్ల వరాలు కూడా మన వరాల్లో కలిపేస్తారు. మన వరాలతో బాటు వాళ్ల వరాలు కూడా మనం కోరి పెట్టాలి! అందుకే మనం ఏ ఏ వరాలు కోరుకుంటామో ముందుగా ఫారంలో ఫిలప్ చెయ్యాలి!''

''అంటే మనం ఎక్కడ కావాలంటే అక్కడ కూర్చుని తపస్సు చేసుకోడానికి వీల్లేదా?''

''అదేగా చెబుతున్నాను. మన 'సౌత్' వాళ్లు దేవుళ్లు ప్రత్యక్షం అయ్యేక వాళ్లని బుట్టలో వేసేసి, అట్టా జేసి, ఇట్టా జేసి, మాయజేసి పెద్ద పెద్ద వరాలు కొట్టేస్తామని వీళ్లకి మనం అంటే మంట! అందుకే రిజర్వేషను పెట్టి మనకి 25శాతం గుట్టలే కేటాయించారు. మన మీద నిఘా కూడా ఉంటుంది. తను చెప్పిన వరాలు కోరలేదని మొన్నొక 'నార్త్' రుషి కోపం పట్టలేక ఇద్దరు 'సౌత్' రుషుల్ని లేపేశాడు!''

''ఛ! మరీ ఇంత వరస్టా?''

''ఇవేం కొత్తవి కావు నాయనా! పూర్వం శివభక్తులకీ, విష్ణుభక్తులకీ అసలు పడేది కాదట. అదే ఇప్పుడూ కంటిన్యూ అవుతోంది. బ్రహ్మ యూనియన్, విష్ణుయూనియన్, శివ యూనియన్, శక్తి యూనియన్, దుర్గ యూనియన్...అని రకరకాల యూనియన్లు ఉన్నాయి. ఈమధ్యనే 'రంభ యూనియన్' స్టార్టయింది. 'డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు రంభ డాట్ కామ్' అని ఓ వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. ఇంద్రుడి పోస్టు కాపాడటం కోసం ఆర్నెల్లకోసారి రంభ వచ్చి అందరి తపస్సులూ 'తుస్సు' మనేలా చేసి వెళ్లిపోతూ ఉంటుంది. ఆమె అందానికి బానిసలైపోయి కొత్తరుషులంతా ఆమె యూనియన్లో చేరిపోతున్నారు. వచ్చినప్పుడల్లా తన యూనియన్ మెంబర్లందరికీ ఆమె 'షేకెండ్' ఇస్తుంది. అవన్నీ తర్వాత చెబుతాగానీ ముందు ఫారం ఫిలప్ చెయ్యి!''

ఆంజనేయుల్ని శివుడి లైన్లో నిలబెట్టి రిజిస్ట్రేషన్ చేయించాడు విసినాధం. తర్వాత మరో చోటికెళ్లారు.

అక్కడొక ముసలి రుషి జపమాల తిప్పుతూ చుట్టూ ఉన్న చిన్న రుషుల్ని తిడుతున్నాడు.

''ఆయనే శివ యూనియన్ హెడ్! ఆయనే నీకు తపస్సు ప్లేస్ కేటాయిస్తాడు. ఆయన కనికరిస్తే నా పక్కనే నీకు కేటాయిస్తాడు. ఆంధ్రా స్వీట్లంటే పడి చస్తాడు. ముందు ఈ రెండు మినప సున్నుండలూ; పూతరేకులూ చేతిలో పెట్టి నమస్కారం చెయ్! తర్వాత రిజిస్ట్రేషన్ స్లిప్ చూపిద్దువుగాని'' ఆంజనేయుల్ని ముందుకు తోశాడు విసినాధం.

ఆయన పెట్టిన ముహూర్తానికి ఆంజనేయులు తపస్సు ప్రారంభించాడు విసినాధం గుట్టపక్కనే.

మధ్యాహ్నం ఓ గెడ్డపాయన సైకిల్ మీదొచ్చి అందరికీ భోజనం కారియర్లిచ్చాడు. నెలకి మూడు వేలు కడితే ఇలా రెండు పూటలా కారియర్ ఇస్తారని చెప్పాడు విసినాధం. ఉంగరాలూ, గొలుసులూ తాకట్టు పెట్టుకుని డబ్బిచ్చే దుకాణం పక్కవీధిలో ఉందని కూడా చెప్పాడు.

కారియర్లో కందకుర్మా, కంద పులుసు, కందరొట్టి ఉన్నాయి. రుషులు కందమూలాలు తిని తపస్సు చెయ్యాలని విసినాధం అన్నాడు.

నవ్వుతూ అంతవరకూ మాట్లాడిన విసినాధం మొహం ఒక్కక్షణంలో పాలిపోయింది. అతడు చెంగున దూకి గుట్టపక్కన నక్కి దాక్కున్నాడు. ఇద్దరు లావుపాటి రుషులు మీసాలు తిప్పుకుంటూ ఆంజనేయులుని ఎగాదిగా చూస్తూ అతడి పక్కనించే వెళ్లారు.

తర్వాత మెల్లగా బయటకొచ్చిన విసినాధం ''హమ్మయ్య బతికేను!'' అన్నాడు గుండెల మీద చెయ్యి వేసుకుని. ''మొన్న క్రికెట్ మ్యాచ్ ఆడినప్పుడు వాళ్లతో నాకు పెద్ద గొడవైంది'' అన్నాడు.

''క్రికెట్ మ్యాచా? రుషులాడతారా?''

''చస్తారా ఎంటర్‌టైన్‌మెంట్ లేకపోతే! ప్రతి సెకండ్ సాటర్ డే, సండే తపస్సుకి సెలవులు. అప్పుడే క్రికెట్ మ్యాచులూ, గుంటీ బిళ్లలు, కబడ్డీ ఆడతాం! ముసలి రుషులు అవ్వా అప్పచ్చీ, వామనగుంటలూ, దూదుంపుల్లలూ ఆడుకుంటారు. సీనియర్ రుషులకి ఫామిలీస్ ఉన్నాయి. వాళ్లు కార్డ్స్ ఆడుతూ ఉంటారు'' అన్నాడు విసినాధం కంద పులుసులో వేళ్లు ముంచి నాక్కుంటూ.

● ● ●

''గురూ రండ్రండి! రంభొచ్చింది! రంభొచ్చింది!'' ఓ కుర్ర రుషి హడావుడిగా కేకలు పెడుతూ పరుగెడుతున్నాడు.

''దా ఆంజనేయులూ రంభొచ్చిందట! దా, క్విక్!'' మొహం చేటంత చేసుకుని చెయ్యి పట్టుకు లాక్కెడుతున్నాడు విసినాధం.

''సారీ విసినాధం! ఐ కాంట్! నేను తపస్సు ప్రారంభించి ఇంకా రెండు రోజులైనా కాలేదు!'' ఆంజనేయులు సీరియస్‌గా అన్నాడు.

''అందుకే రమ్మంటూంటా! రెండ్రోజులే కదా... మళ్లీ ప్రారంభిద్దువుగాన్లే! పదేసేళ్లుగా తపస్సు చేస్తున్న వాళ్లు ఒక్కసారి రంభని చూశాక తిరిగి శివుడి కోసం ధ్యానం చెయ్యలేదు. ఆమె యూనియన్లో చేరిపోయి ఆమె 'షేకెండ్' కోసం తహతహలాడిపోతున్నారు. దా! ఆమెనొక్కసారి చూస్తే ఈ మాటనవు! అంత బ్యూటిఫుల్ గాళామె!'' అంటూ ఆంజనేయుల్ని బలవంతాన లాక్కెళ్లిపోయాడు విసినాధం.

అంతవరకూ ఆమె సోయగాల్ని చూసిన ఆంజనేయులు 'ఫ్లాట్' అయిపోయాడు. ఏదో సినిమాల్లో చూట్టమే తప్ప ప్రత్యక్షంగా రంభని చూస్తానని అతడు కలలో కూడా అనుకోలేదు.

''ఈ అవకాశం మళ్లీ రాదు'' అనుకుని చెంగున ముందుకు దూకి మాయం అయిపోతున్న రంభ నడుం పట్టుకుని ''ఐ లవ్యూ రంభా! ఐ లవ్యూ! ప్లీజ్ గివ్ మీ షేకెండ్! ప్లీజ్ గివ్ మీ ఎ కిస్!'' అరుస్తున్నాడు.

● ● ●

''ఛీ వదలండి! ఇదేంటి! డ్యూటీలో ఉన్న ఏర్ హోస్టెస్‌ని ఇలా పట్టుకుని న్యూసెన్స్ చెయ్యకూడదు! ఆమాత్రం తెలియదా?'' తుళ్లిపడ్డాడు ఆంజనేయులు. స్పృహలోకొచ్చాడు ''సారీ మేడం'' అని ఏర్ హోస్టెస్‌కి క్షమాపణలు చెప్పుకున్నాడు. తన పగటి కలకి తనే సిగ్గుపడ్డాడు.

తర్వాత ఇండియా చేరుకుని ఇల్లు చేరుకున్నాడు. అతడు భయపడినట్లు అతడి భార్య అవమానించలేదు. ''పోనీలెండి! ఎవరో ఉద్యోగం ఇవ్వాలా ఏం! మన కాళ్ల మీద మనం నిలబడే ప్రయత్నం చేద్దాం! రేపే సెల్ఫ్ ఎంప్లాయిమెంటుకి దరఖాస్తు చేద్దాం'' అంది.

ఆంజనేయులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

★

